క్లుప్తంగా

అనాథలు, వృద్ధులకు అన్నదానం



కామాక్షీ పీఠంలో పిల్లలతో కలసి సహపంక్తి భోజనం చేస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

అమలాపురం టౌన్: డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా అన్నదాన నిర్వహణ సంస్థ స్థానిక స్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో దాదాపు 300 మంది అనాథలు, వృద్ధులు, యాచికులకు సోమవారం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసింది. యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ అతిథిగా పాల్గొన్నారు. స్థానిక కామాక్షీ పీఠంలోని ప్రేమ మందిరం పిల్లలకు ఏర్పాటు చేసిన అన్నదానంలో డీఎస్పీ అంబికా ప్రసాద్ పాల్గొన్నారు. అనాథ పిల్లలతో కలసి డీఎస్పీ సహపంక్తి భోజనం చేశారు.

సీఐ క్రిస్టోఫర్‌కు వ్యాపార సంఘాల సత్కారం

అమలాపురం టౌన్: పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన క్రిస్టోఫర్‌ను ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పట్టణ వ్యాపారులు పోలీసులకు సహకరించాలని సీఐ క్రిస్టోఫర్ కోరారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో వ్యాపార సంఘాల ప్రతినిధులు సీఐని సత్కరించారు. చాంబర్ ప్రతినిధులు కంచిపల్లి అబ్బులు, అల్లూరి రమేష్‌రాజు, కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, దొమ్మేటి సాయిబాబు, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు సీఐను కలిశారు.

పవర్ లిఫ్టింగ్ విజేత వీరేంద్రకు సన్మానం



వీరేంద్రను సత్కరిస్తున్న జిల్లా సంఘ ప్రతినిధులు

అమలాపురం టౌన్: తెనాలిలో ఇటీవల జరిగిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో అమలాపురం హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ క్రీడాకారుడు మారే వీరేంద్ర రాష్ట్రం తరపున పాల్గొని, 650 కేజీల బరువెత్తి సత్తా చాటాడు. ఈ పోటీల్లో వీరేంద్ర జాతీయ స్థాయిలో తృతీయ స్థానం సాధించి, కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. విజేత వీరేంద్రకు స్థానిక హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్‌లో సోమవారం అభినందన సత్కారం జరిగింది. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, ప్రతినిధులు వంటెద్దు వెంకన్నాయుడు, దొమ్మేటి వెంకటరమణ, జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, జిల్లా కోచ్ ఎంవీ సముద్రం తదితరులు విజేత వీరేంద్రను సత్కరించారు.

అదుపు తప్పిన కారు



బోల్తా పడిన కారు

అల్లవరం: ఎదురుగా వస్తున్న వాహనాలను కారు ఢీకొన్న సంఘటన జాతీయ రహదారిపై బోడసకుర్రు వద్ద సోమవారం జరిగింది. రాజోలు నుంచి అమలాపురం కారులో వస్తున్న బొంతు నితిన్.. మద్యం మత్తులో ఎదురుగా వస్తున్న కారు, ఆటోను ఢీకొట్టాడు. కారు అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. నితిన్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తాళ్లరేవు: తాళ్లరేవు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 24న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.అనుపమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కార్యాలయంలోని సమావేశపు హాలులో జరిగే ఈ సమావేశానికి ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షత వహిస్తారన్నారు.

అగ్నికుల క్షత్రియ పేరును చేర్చాలి

అల్లవరం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకం మత్స్యకార భరోసా పథకానికి ముందు అగ్నికుల క్షత్రియను చేర్చి.. అగ్నికుల క్షత్రియ మత్స్యకార భరోసాగా నామకరణం చేయాలని అల్లవరం మండలం సామంతకుర్రు గ్రామానికి చెందిన కొల్లు గౌతమ్‌బాబు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో డీఆర్‌ఓ సత్తిబాబుకు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మత్స్యకారులు, చేపలవాళ్లు, మరకాలు, పెళ్లికారులుగా పిలుస్తున్నారని పేర్కొన్నారు. తద్వారా తమ మనోభావాలు దెబ్బతింటున్నాయని తెలిపారు.



అమలాపురంలోని ఓ విద్యాలయంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి వేషధారణల్లో చిన్నారులు



అమలాపురంలోని ఓ షాపింగ్ మాల్‌లో షో కేసు బొమ్మలు ఇలా..



అల్లవరం మండలం మొగళ్లమూరు కోదండ రామాలయంలో పూజలు చేస్తున్న ఎంపీ అనురాధ



మురమళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, మహిళలు



తిళ్లకుప్పలో రామనామ జపం చేస్తున్న భక్తులు

పావన రామ.. సకల గుణాభిరామ

- మార్మోగిన శ్రీరామ నామస్మరణం
- రామాలయాల్లో పట్టాభిషేకాలు, హనుమాన్ చాలీసా పఠనం
- శోభాయాత్రలు, భజనలతో భక్తుల జపం
- అన్న సమారాధనలు, బెల్లం పానకాల పంపిణీ
- పట్టణమంతా ఆధ్యాత్మిక సందడి



అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిర్వహిస్తున్న భారీ శోభాయాత్ర



ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అల్లవరంలో బైక్ ర్యాలీ చేస్తున్న భక్తులు



ముమ్మిడివరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా అమలాపురం పట్టణంలోని 22 రామాలయాలు సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తులతో కిటకిటలాడాయి. రామాలయాల్లో శ్రీరామ పట్టాభిషేకాలు, హనుమాన్ చాలీసా పఠనంతో శ్రీరామ జపం మార్మోగింది. ప్రతి ఇల్లు, ప్రతి రామాలయం, ప్రతి కూడలి ముస్తాబై కళకళలాడుతూ వర్ణ శోభితమయ్యాయి. రామాలయాలు, ఇళ్లపై శ్రీరామ్ జెండాలు రెపరెపలాడాయి. అమలాపురం గడియారం స్తంభం సెంటర్‌లో పలు సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో భక్తులు శోభాయాత్రలు నిర్వహించారు. రామాలయాల వద్ద ఏకాహం, సప్తాహం వంటి భజనలు జరిగాయి. శ్రీరామ తీర్థం, ప్రసాదంగా పట్టణంలోని గడియారం స్తంభం సెంటర్, వనచర్ల వారివీధి తదితర ప్రాంతాల్లో భక్తులకు బెల్లం పానకాన్ని వితరణ చేశారు. గడియారం స్తంభం సెంటర్‌లో కర సేవకులను సత్కరించారు. కొంకాపల్లి వాసులు, వాసవీ కన్యకా పరమేశ్వరి సంఘ మహిళలు, భజరంగదళ్, విశ్వ హిందూ పరిషత్, చాంబర్ ఆఫ్ కామర్స్ ఇలా పలు సంస్థలు, సంఘాలు శోభాయాత్రలు నిర్వహించాయి. విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి బులుసు జగదీష్, భజరంగ దళ్ ప్రతినిధి శిరంగు నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యల్లమిల్లి నాగ సుధ కొండ తదితరులు తమ సంస్థల ఆధ్వర్యంలో శ్రీరామ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి అయ్యాక రామాలయాల వద్దే కాకుండా ఇళ్లలోనూ దీపాలు వెలిగించి పరిసరాలను దేదీప్యమానం చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కొందరు ముస్లింలు కూడా పాల్గొనడం ప్రత్యేకతను సంతరించుకుంది.

గ్రామాల్లో రామనామ జపం

ఐ.పోలవరం: అయోధ్య రామమందిరంలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలు రామనామ జపంతో తన్మయం చెందాయి. తిళ్లకుప్ప గ్రామం వినాయకుని ఆలయం నుంచి గ్రామోత్సవం నిర్వహించి, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, అక్షింతలు శిరస్సున ధరించారు. పాత ఇంజరంలోని రామాలయంలో స్వామి వారికి అష్టోత్తర పూజ, నగర సంకీర్తన నిర్వహించారు. ఆలయం వద్ద భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి, రామ నామ సంకీర్తన చేస్తూ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని తిలకించారు. కేశనకుర్రు, కొమరగిరి, పశువుల్లంక, ఎదుర్లంక, జి.వేమవరం, గుత్తినదీవి తదితర గ్రామాల్లో ఉదయం నుంచి ఆలయాల వద్ద పూజలు, భజనలు, అభిషేకాలు నిర్వహించారు. మురమళ్లలో శాంతినికేతన్ పాఠశాలలో విద్యార్థులు, మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఐ.పోలవరంలో శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

వాడవాడలా రామనామం

ముమ్మిడివరం: అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నియోజకవర్గంలో వాడవాడలా రామ నామం జపించారు. రామాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముమ్మిడివరం శివారు పల్లిపాలెం శ్రీహరి సాకేత వేంకటేశ్వరస్వామి ఆలయంలోని ఉపాలయంలో సీతారామచంద్ర స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుడు పెన్మత్స చిట్టిరాజు ఆధ్వర్యంలో వందలాది మందితో బైక్ ర్యాలీ నిర్వహించి, వివిధ గ్రామాల్లో రామాలయాలను సందర్శించారు. రామాలయాల్లో దీపారాధనలు చేసి సీతారాములను దర్శించుకున్నారు. అలాగే సీహెచ్ గున్నేపల్లి సీతారామాలయంలో సమరసత సేవా ఫౌండేషన్, రాష్ట్రీయ హిందూ సేవ సంయుక్త ఆధ్వర్యంలో కోటి హనుమాన్ చాలీసా పారాయణ, మహాశక్తి హోమం నిర్వహించారు. శృంగవృక్షం దత్త పీఠాధిపతి సాయి దత్త నాగనంద సరస్వతి స్వామీజీ ప్రసంగించారు. చిన కొత్తలంక, గాడిలంక, కొత్తలంక, అయినాపురం, ముమ్మిడివరం, ఠానేల్లంక, అనాతవరంతో పాటు పలు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.



సీహెచ్ గున్నేపల్లిలో ప్రసంగిస్తున్న దత్త పీఠాధిపతి సాతదత్త నాగనంద సరస్వతీస్వామిజీ



నీలపల్లిలో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు



కాట్రేనికోన గేట్ సెంటర్‌లో యువకుల బైక్ ర్యాలీ

గ్రామగ్రామాన ప్రాణప్రతిష్ఠ ఉత్సవాలు

అల్లవరం: అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని మండలంలోని వాడవాడలా ఉత్సవాలు నిర్వహించారు. ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా అల్లవరం మొల్లేటిగరువులోని కోదండ రామాలయంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం అల్లవరం నుంచి అమలాపురం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. దేవగుప్తంలో వేద పండితులు సీతారామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను భక్తులకు అందించారు. అల్లవరం మండలం మొగళ్లమూరులోని కోదండ రామాలయంలో ఎంపీ చింతా అనురాధ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో శోభాయాత్రలు

తాళ్లరేవు: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో శోభాయాత్రలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తాళ్లరేవు, నీలపల్లి, పి.మల్లవరం, లచ్చిపాలెం, జార్జిపేట, కోరంగి, జి.వేమవరం, చొల్లంగి తదితర గ్రామాల్లో సీతారామ లక్ష్మణ, హనుమ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కోరంగిలో సీతారామ, లక్ష్మణ, హనుమ, భరత శత్రుఘ్నుల వేషధారణలతో చిన్నారులు ట్రాక్టర్‌పై ఊరేగారు. తాళ్లరేవు కేశవస్వామి ఆలయం వద్దనుంచి నగర సంకీర్తన, భజన, దీపోత్సవం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. లచ్చిపాలెం రామాలయం వద్ద ప్రత్యేక భజనలు చేశారు. పలుచోట్ల భారీ స్క్రీన్లలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు వీక్షించారు. అన్నదానాలు, ప్రసాద వితరణలు జరిగాయి. పాతకోరంగి సీతా రామాలయం వద్ద, సీతారామపురంలోని గెద్దాడ వారి రామాలయం వద్ద మహిళలు దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు.

అంతా రామ నామ జపం

కాట్రేనికోన: అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవ ఘడియల్లో రామ నామం జపం చేస్తూ భక్తులు తన్మయం చెందారు. మండలంలోని కాట్రేనికోన, చెయ్యేరు, లక్ష్మీవాడ, ఉప్పూడి, దొంతికుర్రు, బలుసుతిప్ప, పల్లం, గచ్చకాయలపోర, వేట్లపాలెం, కందికుప్ప, పల్లంకుర్రు తదితర ప్రాంతాల్లో సీతారామచంద్రులను పల్లకీలో ఊరేగించారు. ఉప్పూడి అభయాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అన్న ప్రసాద వితరణ చేశారు. కాట్రేనికోనలో ఎస్ఆర్కే అశోక్ నిర్మించిన రామాలయంలో అన్నప్రసాద వితరణ జరిగింది. నవ భారత్ గ్రామీణాభివృద్ధి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అంగాడి రేవతి, రామకృష్ణ ఆధ్వర్యంలో గేటు సెంటరులో రెండు వేల మందికి పులిహోర, పానకం పంపిణీ చేశారు. యూత్ బైక్ ర్యాలీ జరిగింది.

ఎటుచూసినా శ్రీరామ స్మరణే..

ఉప్పలగుప్తం: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండంలోని పలు గ్రామాలు శ్రీరామ స్మరణతో మార్మోగాయి. ఉప్పలగుప్తంలో అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సీతారాముల కల్యాణం నిర్వహించారు. వాడపర్రు, విలసవిల్లి గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

ప్రత్యేక పూజలు

అమలాపురం రూరల్: అమలాపురం సుబ్బాలమ్మ తల్లి దేవాలయం వద్ద శ్రీరామసీత మాతలకు ప్రత్యేకంగా పూజలు చేశారు. వ్యాపారులు అమ్మవారి ఆలయంలో పూజలు, ప్రసాద వితరణ చేశారు.

సీఎస్‌సీని ప్రారంభించిన కలెక్టర్



సర్వీస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శుక్లా

అమలాపురం రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెచ్‌డీఎఫ్‌సీ బిజినెస్ కరస్పాండెంట్ కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ)ను సోమవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మినీ బ్యాంక్ సేవలు, సిటిజన్ సర్వీసులన్నీ ఈ సెంటర్‌లో లభిస్తాయన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుమారు 26 రకాల సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. వీటితో పాటు డిజిపే, ఆధార్ సేవలు, ఈ-స్టాంపింగ్, ఈ-శ్రమ్, రైల్వే, బస్సు టికెట్ల బుకింగ్, బీమా ప్రీమియం చెల్లింపు, పాస్‌కార్డు జారీ తదితర సేవలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, హెచ్‌డీఎఫ్‌సీ ఉన్నతాధికారి నిమ్మల వెంకటసత్యనారాయణ, కోనసీమ క్లస్టర్ హెడ్ వెంకట సూర్య రాజకిరణ్, బ్రాంచ్ మేనేజర్లు ఆకెళ్ల శ్రీనివాస్, గంధం గణపతిరావు, సీఎస్‌సీ జిల్లా మేనేజర్లు రాజేష్, ఆదిత్య, ఎల్‌డీఎం కె.శ్యాంబాబు, డీఆర్‌డీఏ పీడీ కె.శివశంకర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ చాముండేశ్వరి

ఐ.పోలవరం: కొమరగిరి జెడ్పీ పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ ఈ ట్యాబ్‌ల వల్ల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెరుగుతుందని, ఈ-నాలెడ్జ్ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ట్యాబ్‌లు సక్రమ రీతిలో, పాఠ్యాంశాలు నేర్చుకోవడానికి ఉపయోగించాలన్నారు. ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, సర్పంచ్ విజయ చాముండేశ్వరి, సొసైటీ అధ్యక్షుడు ఏలూరి ఆదినారాయణ తదితరులు విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే అజెండా

- కౌన్సిల్‌లో చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్
- వార్షిక అంచనా బడ్జెట్ రూ.20.40 కోట్లు



సమావేశంలో మట్లాడుతున్న చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం: ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా వార్షిక అంచనా బడ్జెట్ రూపొందించామని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. నగర పంచాయతీ సమావేశ మందిరంలో సోమవారం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. నగర పంచాయతీలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమాన భాగస్వామ్యం కల్పిస్తూ వార్షిక బడ్జెట్ రూపొందించామని వివరించారు.

ఏకగ్రీవ ఆమోదం

నగర పంచాయతీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.20.40 కోట్లతో వార్షిక అంచనా బడ్జెట్‌ను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. గడచిన ఏడాది బడ్జెట్‌ను సవరిస్తూ, వచ్చే ఏడాదికి అంచనా బడ్జెట్‌ను రూపొందించారు. ఈ బడ్జెట్ అంశాలను సమావేశంలో ప్రవేశపెట్టగా, ఆదాయ, వ్యయాలకు సంబంధించిన వివరాలపై చర్చ నిర్వహించారు. చివరకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. బడ్జెట్‌లో ప్రారంభ నిల్వ రూ.2.53 కోట్లు కలిపి, వివిధ ఆదాయ వనరుల నుంచి రాబడులు, మూలధన ఆదాయం కింద రూ.17.40 కోట్లు చూపిస్తూ, అంచనా బడ్జెట్‌ను రూ.20.40 కోట్లుగా రూపొందించారు. అంత్య నిల్వ రూ.30 లక్షలుగా పేర్కొన్నారు. బడ్జెట్‌లో రోడ్లు, డ్రైన్లు, మంచినీటి సరఫరాకు పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. ఈ సమావేశంలో కమిషనర్ జి.లోవరాజు, వైస్ చైర్మన్లు వేటుకూరి బోసురాజు, రెడ్డి హేమ సుందరి, కౌన్సిలర్లు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలని వినతి

ఉప్పలగుప్తం: విలసవిల్లి గ్రామంలోని భాగమైన గోకనవిల్లి ప్రాంతాల మధ్య ఉన్న అమలాపురం డ్రెయిన్‌పై వంతెన నిర్మించాలని గోకనవిల్లి గ్రామానికి చెందిన ముషిణి లింగేశ్వరరావు సోమవారం మండలస్థాయి స్పందనలో విజ్ఞాపన అందించారు. తమ గ్రామం గోకనవిల్లి నుంచి పంచాయతీ కార్యాలయానికి రావడానికి దూరం కావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. వంతెన నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

తీర ప్రాంతాలకు రక్షిత మంచినీరు

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



బలుసుతిప్పలో మంచినీటి పైపులైన్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్

కాట్రేనికోన: బాహ్య ప్రపంచానికి దూరంగా, సముద్ర తీరంలో ద్వీపంలా ఉన్న మగసానితిప్ప వంటి గ్రామాలకు సైతం రక్షిత మంచినీరు అందిం చామని టీటీడీ పాలకవర్గ సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. బలుసుతిప్పలో సోమవారం సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు అధ్యక్షతన మంచినీటి ట్యాంకు, పైపులైన్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు అందించాలనే ధ్యేయంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో చాకలిపేట, కొత్తపాలెం, మొల్లేటిమొగ, గొల్లపేటకు చెందిన ప్రజలు గుక్కెడు మంచినీటి కోసం సముద్ర తీరంలోని చలమల్లో, గుంటల్లో నీరు తెచ్చుకునే వార న్నారు. ఆయా గ్రామాలకు శాశ్వత పరిష్కారంగా ఇంటింటికీ రక్షిత మంచి నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. బలుసుతిప్పలో సీఎస్సార్, ఓఎన్‌జీసీ నిధులు రూ.36 లక్షలతో నిర్మించనున్న మంచి నీటి ట్యాంకు, జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.90 లక్షలతో ఇంటింటికీ మంచి నీటి కుళాయి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ముందుగా దొంతికుర్రులో అయోధ్య రామ మందిర పాణ ప్రతిష్ఠ సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లా నరసింహమూర్తి, ఏడిది సుబ్బు, మల్లాడి ఆదినారాయణ, ఇసుకపట్ల శ్రీనుబాబు, పాలెపు ధర్మారావు, తిరుమాని సత్తిబాబు, ఓలేటి సతీష్, నాతి అలివేణి, నాతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఏఈని నిలదీసిన రైతులు

ఉప్పలగుప్తం: అయినాపురం-కూనవరం కాలువపై తీవ్ర సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నామన్న రైతుల విజ్ఞప్తి మేరకు క్షేత్ర పరిశీలనకు వచ్చిన ఇరిగేషన్ ఏఈ శివరామకృష్ణను వాడపర్రులో రైతులు సోమవారం నిలదీశారు. నారుమడులకు సాగు నీరు సక్రమంగా అందడం లేదని రైతులు పేర్కొన్నారు. పంట కాలువలో పూడిక తొలగింపు పనులు కాంట్రాక్టర్‌కు అప్పగించినట్టు ఏఈ చెప్పారు. అతని నిర్లక్ష్యం వల్లే ఈ సమస్య ఎదురైందని తెలిపారు. ఇప్పటివరకు 4.2 కి.మీ. మేర పూడిక తొలగించినట్టు చెప్పారు. ఈ విషయాన్ని రైతులు రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్‌కు ఫోన్ ద్వారా తెలిపారు. మంత్రి స్పందిస్తూ, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని తెలిపారు. నాలుగు రోజుల్లో కూనవరం శివారు ప్రాంతానికి సాగు నీరందేలా చర్యలు తీసుకుంటానని ఏఈ రైతులకు హామీ ఇచ్చారు.

యోగా గురువు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: కోరంగి ప్రభుత్వ హోమియో వైద్యశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు యోగా గురువు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వైద్యురాలు డా.ఎం.విజయ ప్రతిభ తెలిపారు. ఈ పోస్టులకు పురుషులు, స్త్రీలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పురుషులు నెలలో 32, స్త్రీలు 20 గంటల పాటు పనిచేయాల్సి ఉంటుందన్నారు. యోగాలో డిగ్రీ, పీజీ, డిప్లమో ఉన్న వారితో పాటు, యోగాలో అనుభవం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 94404 13117 నంబరులో సంప్రదించాలని కోరారు.

శాశ్వత అన్నదానానికి విరాళం

అమలాపురం టౌన్: వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతి శనివారం జరిగే అన్న సమారాధనకు పట్టణంలోని గండు వీధికి చెందిన గోకరకొండ వెంకట సుబ్రహ్మణ్య సూర్య సాయి రూ.5 వేలు విరాళంగా సమకూర్చారు. ఈ చెక్కును ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవికి సోమవారం అందించారు. వైఎస్సార్ సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు దూడల ఫణి పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయ నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన చల్లూరి చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు సోమవారం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. దాతను ఆలయ మర్యాదలతో ఈఓ వీరభద్రరావు సత్కరించారు.

క్రీడా పరికరాల పంపిణీ

అల్లవరం: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి, నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు స్పోర్ట్స్ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్ కిట్లను అందించారు. జెడ్పీటీసీ కొనుకు గౌతమి, ఎంపీడీఓ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పేద మహిళలకు దుప్పట్ల పంపిణీ

అమలాపురంరూరల్: చిందాడ గరువు గ్రామానికి చెందిన ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ, సామాజిక కార్యకర్త వెంకటేశ్వరరావు దంపతుల సేవలు అభినందనీయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ, వెంకటేశ్వరరావు సౌజన్యంతో సమకూర్చిన 150 దుప్పట్లను నిరుపేద మహిళలకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కలెక్టరేట్‌లో సోమవారం పంపిణీ చేశారు. డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, ఏఓ కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

దాడులకు నిరసనగా కాంగ్రెస్ ధర్నా

అమలాపురం టౌన్: రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో జరుగుతున్న భారత్ జోడో న్యాయ యాత్రపై అస్సాం రాష్ట్రంలో బీజేపీ ముసుగులో కొందరు దాడులు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక గడియారం స్తంభం సెంటరులో జిల్లా కాంగ్రెస్ నాయకులు సోమవారం సాయంత్రం ధర్నా చేశారు. అక్కడున్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరావు ధర్నాను ప్రారంభించారు. ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, నాయకులు కొత్తూరు శ్రీనివాసరావు, ముషిణి రామకృష్ణారావు, సుభాషిణి, వంటెద్దు బాబి పాల్గొన్నారు.

చురుగ్గా సాగుతున్న కుల గణన

అమలాపురం టౌన్: పట్టణంలోని 15వ వార్డు సచివాలయాల పరిధిలో బీసీ కుల గణన సర్వే చురుగ్గా సాగుతోంది. ఇప్పటి వరకూ 30 శాతం సర్వే పూర్తయింది. సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్ల సమక్షంలో ఇంటింటా సర్వే జరుగుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన 31 ప్రశ్నలకు సర్వే సిబ్బంది సమాధానాలు రాబడుతున్నారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు పర్యవేక్షణతో సర్వే జరుగుతోంది. మిగిలిన సర్వేను నిర్దేశిత గడువైన ఈ నెల 28లోపు పూర్తి చేస్తామని కమిషనర్ అయ్యప్పనాయుడు తెలిపారు.

రెడ్ క్రాస్ మాజీ కార్యదర్శికి సత్కారం

అమలాపురం రూరల్: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు సొసైటీ మేనేజింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో సోమవారం జరిగింది. డీఆర్‌ఓ సత్తిబాబు సమక్షంలో సంస్థ జిల్లా చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ (ఢిల్లీ నారాయణ) అధ్యక్షత వహించారు. సెక్రటరీ పీఎస్ శర్మ పదవీ విరమణ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. కొత్తగా సెక్రటరీగా నియమితులైన మెట్టి రాజు, జాయింట్ సెక్రటరీలు కృష్ణమూర్తి, బోనం రాజు, జల్లి సుజాతను సొసైటీలోకి ఆహ్వానించారు.